క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐలు



సీపీ శ్వేతకు మొక్కను అందజేస్తున్న గౌరారం ఎస్సై విజయభాస్కర్

సిద్దిపేటకమాన్: పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఎస్‌ఐలు బాధ్యతలు చేపట్టారు. దుబ్బాక ఎస్‌ఐగా గంగరాజు, భూంపల్లి ఎస్ఐగా భువనేశ్వర్, మిరుదొడ్డి ఎస్ఐగా నరేష్, గౌరారం ఎస్సైగా ఎస్. విజయభాస్కర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా వారు పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ శ్వేతను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను బహుకరించారు. తమ పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు ఎలాంటి భంగం కలగకుండా విధులు నిర్వర్తించాలని ఎస్‌ఐలకు సీపీ సూచించారు.

ఉచిత వైద్య శిబిరం



జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని లింగారెడ్డిపల్లిలో శుక్రవారం ఇటిక్యాల ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో సుమారు 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో ఫార్మసిస్టు వినయ్, సర్పంచ్ కనకలక్ష్మీ చంద్రం, నాయకులు పాల్గొన్నారు.

'మిషన్ భగీరథ' నీరు తాగొద్దు

తొగుట(దుబ్బాక): వర్షాల నేపథ్యంలో మిషన్ భగీరథ నీటిని తాగవద్దని ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మండల కేంద్రంలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. భారీ వర్షాలతో నీరు కలుషితంగా మారిందని.. ఆ నీటిని తాగి అనారోగ్యం బారిన పడొద్దన్నారు. నల్లాల ద్వారా సరఫరా అవుతున్న నీటని కాచి చల్లార్చి వడపోసి తాగాలని పేర్కొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కొండాపూర్ గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు కావడంపై సర్పంచ్ పెద్ది కవితారాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ నంట బాపురెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గుండం రాజమహేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని జిల్లెలగడ్డ గిరిజన గురుకుల ప్రతిభా కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో సీట్లు మిగిలి ఉన్నాయని.. అర్హత గల ఎస్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆర్సీఓ వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 03, బైపీసీలో 10 సీట్లు ఉన్నాయని.. 10వ తరగతిలో 8 జీపీఏ అంతకన్నా ఎక్కువ జీపీఏ సాధించిన గిరిజన బాలురు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు గజ్వేల్ నియోజకవర్గంలో మంత్రి పర్యటన

గజ్వేల్: గజ్వేల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల కార్యక్రమానికి శనివారం రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు హాజరవుతున్నట్టు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ములుగు, గౌరారంలో కొత్త పోలీస్‌స్టేషన్ భవనాలు, గజ్వేల్– ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఏసీపీ కార్యాలయానికి శంకుస్థాపన, శ్రీగిరిపల్లిలో పశువైద్యశాల ప్రారంభోత్సవం, ప్రజ్ఞాపూర్‌లో ఈద్గా వద్ద షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం, గజ్వేల్ పట్టణంలోని ఐవోసీలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ, బస్తీ దవాఖానా ప్రారంభోత్సవం, కుకునూర్‌పల్లిలో నూతన పోలీస్‌స్టేషన్ భవనానికి శంకుస్థాపన, మంగోల్‌లో మహిళా భవనం, పంచాయతీ భవనానికి శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారని వెల్లడించారు.

గుర్రపు డెక్క తొలగింపు



గుర్రపు డెక్కను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని బావిస్‌కాన్‌పుల్ కాలువలో ఉన్న గుర్రపు డెక్కను శుక్రవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాజనర్సు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పొలాల్లో ఇసుక మేటలు

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పొలాల్లో ఇసుక మేటలు భారీగా పేరుకుపోయాయి. దాదాపు రూ. 30 నుంచి 40 వేల వరకు పెట్టుబడి పెట్టామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొతార ం(జే)– ధర్మారం గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న కల్వర్టు ఉధృతంగా ప్రవహించడంతో ఏటా నష్టాన్ని చవిచూస్తున్నామని రైతులు వాపోయారు. - అక్కన్నపేట(హుస్నాబాద్)



చేప చిక్కేనా..?

మండలంలోని నందారం– పోతారం(జే) గ్రామాల మధ్య ఉన్న కల్వర్టుపై శుక్రవారం స్థానికులు చేపలు పడుతూ సందడి చేశారు. విద్యా సంస్థలకు సెలవు దినం ఉండడంతో చిన్నారులు సైతం గొడుగులతో చేపల వేటలో నిమగ్నమయ్యారు. - అక్కన్నపేట(హుస్నాబాద్)



ఇది చెరువు కాదు బడి

మండల కేంద్రమైన మర్కూక్ కేజీబీవీ బాలికల పాఠశాలలో ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల చుట్టూ వర్షం నీరు చేరి చెరువులా మారింది. ప్రతి ఏటా వానాకాలంలో ఇదే దుస్థితి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – మర్కూక్(గజ్వేల్)

అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శం

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశానికే దిక్సూచిగా నిలుస్తుందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్‌లోని సీఎం మినీ క్యాంపు కార్యాలయంలో వర్గల్ మండలం శాకారం, జగదేవ్‌పూర్ మండలం మునిగడప గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌పై దుష్ప్రచారం చేయడానికి ప్రతిపక్షాలు నానాతంటాలు పడుతున్నాయని మండిపడ్డారు. ప్రజలు తప్పుడు ప్రచారాలను నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. బీఆర్ఎస్ సంక్షేమ కార్యక్రమాలకు ఆకరిషతులై వివిధ పార్టీల నుంచి భారీగా వచ్చి చేరుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను వర్తింపజేయడానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. దళితబంధు, బీసీబంధు, మైనార్టీలకు రూ. లక్ష ఆర్థిక సాయంతో పాటు గృహలక్ష్మీ పథకాలకు అర్హులైన వారందరినీ ఎంపిక చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, వర్గల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ రామకృష్ణారెడ్డి, శాకారం సర్పంచ్ ప్రభాకర్, జగదేవ్‌పూర్ సహకార సంఘం చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరుతున్న వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

కొండపాక(గజ్వేల్): సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం 23వ రోజుకు చేరుకుంది. కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాగల లక్ష్మణ్, మండల జేఏసీ నాయకులు నర్సింలు మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, శ్రీనివాస్, వివిధ గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

తొగుట(దుబ్బాక): న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు ఒంటికాలుపై నిలబడి నిరసన వ్యక్తంచేశారు.

హుస్నాబాద్‌రూరల్: వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ అయా గ్రామాల పారిశుద్ధ్య కార్మికులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు దుర్గయ్య, కాసర్ల సదానందం, కార్యదర్శి వేముగంటి మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



కొండపాక: మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

వర్షం నీటిని తొలగించండి

కొండపాక(గజ్వేల్): వర్షం నీటిని చేనులో నిల్వ ఉంచొద్దని మండల వ్యవసాయాధికారి ప్రియదర్శిని రైతులకు సూచించారు. మండల పరిధిలోని బందారంలో వర్షాలకు నీట మునిగిన వరి పంటను శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలకు వరి పంటకు మొగిపురుగు సోకే అవకాశాలుంటాయని.. నివారణకు సూచించిన మందులు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): పత్తి చేనులో వర్షం నీరు నిల్వ ఉంటే వెంటనే బయటకు తీసివేయాలని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ రైతులకు సూచించారు. ఈసందర్భంగా మండలంలోని మరుమాముల, బంజర గ్రామాల్లో పత్తి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ అఖిల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



బందారంలో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ ప్రియదర్శిని

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి



సిద్దన్నపేటలో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అదనపు కలెక్టర్

నంగునూరు (సిద్దిపేట): గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా అందరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. మండల పరిధిలోని సిద్దన్నపేట గ్రామాన్ని శుక్రవారం జిల్లా అధికారులతో కలిసి సందర్శించారు. గ్రామంలో నిర్మించిన మరుగుదొడ్లు, నర్సరీ, డంపింగ్‌యార్డు, మురుగు కాల్వలు, తడి, పొడి చెత్త సేకరణ, పచ్చదనం, తదితర అంశాలపై ఆరా తీశారు. సిద్దన్నపేట గ్రామం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ అవార్డుకు ఎంపికయ్యే అవకాశం ఉన్నందున పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వర్షాకాలంలో ఈగలు, దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. డీపీఓ దేవకీదేవి, డీఆర్‌డీఓ చంద్రమోహన్‌రెడ్డి, అదనపు డీఆర్‌డీఓ కౌసల్య, ఎస్పీఎం సత్యనారాయణ, ఎంపీటీసీ తిరుపతి, భాస్కర్‌రెడ్డి, మల్లేశం, రవి, సిద్దు, నర్సింహులు, యాదగిరి పాల్గొన్నారు.

సామాజిక సమరసతా వేదిక మద్దతు

గజ్వేల్‌రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నరేశ్‌బాబు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొమురయ్యలు డిమాండ్ చేశారు. కార్మికులు చేపట్టిన సమ్మెకు వేర్వేరుగా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బాల్‌నర్సయ్య, నాయకులు వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.

ఏసీరెడ్డికి నివాళి

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ సాయుధ పోరాట అమరుడు, కమ్యూనిస్టు నాయకుడు ఏసిరెడ్డి నరసింహారెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. ఏసీరెడ్డి 32వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు అర్పించారు. అలాగే కొమురవెల్లి మండల కేంద్రంలో వర్ధంతి నిర్వహించారు.

'సమస్యలు పట్టని సర్కార్'

ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని బీఎన్ఆర్‌కేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం డిమాండ్ చేశారు. సిద్దిపేటలో శుక్రవారం భవన నిర్మాణరంగ కార్మికుల సమితి సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులకు శాశ్వత లేబర్ కార్డులు అందజేయాలని ఎన్నో నెలలుగా పోరాటం చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ప్రమాదవశాత్తు కింద పడి మరణిస్తే రూ.10 లక్షల బీమా అందజేయాలన్నారు. కార్మికుల పిల్లలకు కేజీ టూ పీజీ ఉచిత విద్య, ఇల్లు లేని కార్మికులకు డబుల్ బెడ్రూం ఇళ్ల హామీలను ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. కార్మికులు ఏదైనా జబ్బు చేస్తే మెరుగైన వైద్యం అందించాలన్నారు. రాజకీయ లాభం కోసం ఐక్యంగా ఉన్న కార్మికులను విడదీయడం సరికాదన్నారు.

'రైతుబీమా'కు దరఖాస్తు చేసుకోండి

గజ్వేల్ ఏడీఏ బాబునాయక్

గజ్వేల్‌రూరల్: అర్హులైన రైతులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని గజ్వేల్ ఏడీఏ బాబునాయక్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కొల్గూరులో రైతుబీమా పథకంపై అవగాహన కల్పిస్తూ దరఖాస్తులు స్వీకరించారు. ఈసందర్భంగా మండల వ్యవసాయాధికారి నాగరాజుతో కలిసి ఆయన మాట్లాడారు. గజ్వేల్ డివిజన్ పరిధిలోని రాయపోల్‌లో 1,142 మంది, కొండపాకలో 966, గజ్వేల్ 853 మంది రైతులు రైతు బీమా కోసం నమోదు చేసుకోలేదన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల వయసు కలిగిన రైతులు ఈ పథకానికి అర్హులని.. 18 జూలై 2023 వరకు కొత్తగా పాట్టాదారు పాసు పుస్తకం పొందిన వారు సైతం ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇదివరకే రైతుబీమా చేయించుకున్న రైతులు ఆధార్‌కార్డులో ఏమైనా మార్పులు, చేర్పులు, నామిని మార్పు వంటివి ఉంటే మీ క్లస్టర్ పరిధిలోని ఏఈఓలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ అనూష, గ్రామ రైతులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



దుబ్బాక: లచ్చపేటలో నిల్వ నీటిని తొలగిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత



చేర్యాల: నిల్వ నీటిని తొలగిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపరాణి

చేర్యాల(సిద్దిపేట): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని.. పట్టణ ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, కమిషనర్ రాజేంద్రకుమార్ సూచించారు. డ్రై డే సందర్భంగా శుక్రవారం పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో నీటి నిల్వలను తొలగించారు. అంతకుముందు పట్టణ అభివృద్ధి పనులపై చర్చించినట్టు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు నాగేశ్వరరావు, ఆరోగ్యరెడ్డి, అంజనీదేవి, ఏఈ శ్రీకాంత్, మేనేజర్ ప్రభాకర్, జేఏఓ రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

దుబ్బాక: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు దరిచేరకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితా భూంరెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని లచ్చపేట 10వ వార్డులో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్, దోమల మందు పిచికారీ చేశారు. అనంతరం పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గణేష్‌రెడ్డి, కౌన్సిలర్ బంగారయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

దుబ్బాకరూరల్: మండలంలోని పద్మశాలిగడ్డ, నర్లెంగడ్డ, దుంపలపల్లి, బల్వంతాపూర్ గ్రామాల్లో వాంతులు, విరేచనాలు కావడంతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయగా దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. పరిసర ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాచి వడపోసిన నీటినే తాగాలన్నారు. వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజల ఆరోగ్య పరిస్థితిని గమనించాలని తెలిపారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

మండలంలోని ఆకారం– తుజాల్‌పూర్ గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జిపై నీరు ప్రవహించడంతో వాహనదారులు వెళ్లకుండా ముళ్ల కంచె వేశారు. శుక్రవారం ఎమ్మెల్యే రఘునందన్‌రావు బ్రిడ్జిని పరిశీలించారు. వాహదారులకు నెమ్మదిగా వెళ్లాలని సూచించారు.

వంతెన నిర్మాణం చేపట్టాలి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కడవేర్గు గ్రామ శివారులోని లో లెవల్ బ్రిడ్జి వద్ద వెంటనే వంతెన నిర్మాణం చేపట్టాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశాడు. శుక్రవారం బ్రిడ్జిని పరిశీలించి మాట్లాడారు. వరద నీటి ప్రవాహం పెరగడం వల్ల ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ఈ ప్రాంత అభివృద్ధి జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చిరంజీవిలు, నల్లపోచమ్మ ఆలయ మాజీ చైర్మన్ గూడెపు మహేష్, నాయకులు యాదగిరి, బాలస్వామి, మల్లేశం, లాజర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సన్మానం



కొండపాక(గజ్వేల్): సీఐగా పదోన్నతి పొందిన కృష్ణమూర్తిని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్, దుద్దెడ ఎంపీటీసీ గురజాడ బాలాజీ, ఉపసర్పంచ్ గుండెల్లి ఆంజనేయులు, నాయకులు పిల్లి నాగరాజు, తదితరులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. .

రైతులను ఆదుకోండి

చిన్నకోడూరు(సిద్దిపేట): యాసంగిలో అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేల నష్ట పరిహారం ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటివరకు అందజేయలేదని యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి అజ్జు యాదవ్ విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. వానాకాలం నాట్లు మొదలైనా పంట నష్ట పరిహారం చెల్లించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి ఇచ్చిన హామీ వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తొగుట(దుబ్బాక): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని గుడికందులలో సీఎం సహాయనిధి చెక్కులను శుక్రవారం సర్పంచ్ మల్లయ్యతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజు, పర్శరాములు, నగేష్, భైరవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'కక్ష సాధింపు చర్యలు సరికాదు'

సిద్దిపేటకమాన్: దళిత అధికారిపై కక్ష సాధింపు చర్యలు సరికాదని జిల్లా దళిత న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కనకయ్య, ప్రధాన కార్యదర్శి రవిబాబు అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలో వారు మాట్లాడుతూ.. తొగుట ఏపీఓగా పనిచేస్తున్న కిషన్ సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్నా మండలంలోని ఓ గ్రామ సర్పంచ్ అతడిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం సరికాదన్నారు.

ఆగస్టు 5వ తేదీ వరకు అవకాశం

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొత్తగా పట్టా పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ వసంతరావు సూచించారు. శనివారం జగదేవ్‌పూర్ రైతువేదికలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 5వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు.

చెక్ డ్యాం మరమ్మతులు చేపట్టాలి

హుస్నాబాద్: మండలంలోని పందిల్ల చెక్ డ్యాం వర్షాలకు కొట్టుకుపోయిందని.. యుద్ధ ప్రాతిపదికన చెక్ డ్యాం మరమ్మతులు చేపట్టాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చెక్ డ్యామ్ నిర్మాణంలో నాణ్యత లోపించిందని.. వెంటనే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిరాశ్రయులను ఆదుకోండి

హుస్నాబాద్‌రూరల్: భారీ వర్షాలకు నిరాశ్రయులైన ప్రజలకు ఆశ్రయం కల్పించి ఆదుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కార్యదర్శి బోయిని సదన్‌కుమార్ కోరారు. శుక్రవారం ఇదే విషయమై నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

నష్ట పరిహారం చెల్లించండి

కోహెడ(హుస్నాబాద్): వర్షాలతో కూలిన ఇళ్లకు వెంటనే నష్ట పరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ జావిద్ అహ్మద్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మంద ధర్మయ్య, నాయకులు నారాయణగౌడ్, శంకర్, బాలకిషన్, సుధాకర్, రాజేందర్‌రెడ్డి, అబ్దుల్ రఫీ, రాజు, శ్రీనివాస్, చంద్రయ్య, శోభ, పోచయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

కోహెడరూరల్ (హుస్నాబాద్): మండల పరిధిలోని పరివేద గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎడబోయిన రామచంద్రం మృతి చెందడంతో హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు మృతుడి కుటుంబీకులకు శుక్రవారం రూ. 30 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆవుల మహేందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొక్కుల సురేష్, పొన్నం అంజయ్య, లింగం, శ్రీకాంత్, ఉప్పలయ్య, అశోక్, మొండయ్య, మీస కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత

కోహెడరూరల్(హుస్నాబాద్): కోహెడ మండల పరిధిలోని వరికోల్ గ్రామానికి చెందిన జనగాం చంద్రయ్య అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండడంతో విషయం తెలుసుకున్న హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ బాధితుడి కుటుంబ సభ్యులకు, బీఆర్ఎస్ నాయకుల ద్వారా శుక్రవారం రూ. 2 లక్షల ఎల్ఓసీ అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోయడ చంద్రకళ పరుశురాములు గౌడ్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బత్తిని తిరుపతి గౌడ్, ఉప సర్పంచ్ మహ్మద్ రబ్బాని, తదితరులు పాల్గొన్నారు.

పీర్ల ఊరేగింపు



జగదేవ్‌పూర్(గజ్వేల్): మొహర్రం పర్వదినం సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం పీర్ల పండగను ఘనంగా నిర్వహించారు. ఆశన్న, ఊశన్న అన్నదమ్ములు అంటూ పాటలు మారుమోగాయి. దట్టీలు కట్టుకోవడానికి భక్తులు ఆసక్తి చూపారు.